APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : శ్రీ సత్యసాయి / అనంతపురం ఎడిటర్ : సి హరికృష్ణ బుధవారం 03, జూన్ 2026 సంపుటి: 01 సంచిక : 07 పేజీలు : 04 వెల: 2-00/-


# విజయ్‌కు హైకోర్టులో ఊరట



- మనీల్యాండరింగ్ ఆరోపణలకు బ్రేక్
- కేసు విచారణ ముగింపు

చెన్నై, జూన్ 2 (అనంత సూర్య ప్రతినిధి): తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌పై మనీల్యాండరింగ్ చట్టం కింద దర్యాప్తు చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్‌కు మద్రాస్ హైకోర్టులో ముగింపు లభించింది. పిటిషనర్ స్వ-యంగా తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో హైకోర్టు దానికి అనుమతి ఇచ్చి కేసును ముగించింది. దీంతో ఈ వ్యవహారంలో విజయ్‌కు తాత్కాలిక ఊరట లభించింది. మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఏ. ధర్మాధికారి, న్యాయమూర్తి జీ. అరుల్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. అయితే విచారణ ప్రారంభమైన సమయంలోనే పిటిషనర్ తన అభ్యర్థనను వెనక్కి తీసుకోవాలని కోర్టును కోరారు.

2లో



2లో

# కేరళకు కొత్త డిప్యూటీ స్పీకర్

- కాంగ్రెస్ నేతకు విజయం
- నాలుగో మహిళగా రికార్డు
- అసెంబ్లీలో ఘన ఎన్నిక

తిరువనంతపురం, జూన్ 2 (అనంత సూర్య ప్రతినిధి): కేరళ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షానిమోల్ ఉస్మాన్ ఎన్నికయ్యారు. డిప్యూటీ స్పీకర్ పదవికి జరిగిన ఎన్నికలో ఎల్‌డీఎఫ్ అభ్యర్థి మొహమ్మద్ ముషిన్‌పై ఆమె ఘన విజయం సాధించారు.

# అమెరికాలో 30 మంది భారతీయుల అరెస్ట్



2వ పేజీలో

**ట్రక్కు డ్రైవర్లపై తనిఖీలు**
**అక్రమ వలసదారుల గుర్తింపు**
**బహిష్కరణ ప్రక్రియ ప్రారంభం**

. వాషింగ్టన్, జూన్ 2 (అనంత సూర్య ప్రతినిధి): అమెరికాలో అక్రమంగా నివసిస్తూ వాణిజ్య ట్రక్కు డ్రైవర్లుగా పనిచేస్తున్న సుమారు 30 మంది భారతీయులను అమెరికా సరిహద్దు భద్రతా అధికారులు అరెస్ట్ చేశారు. ఫెడరల్ ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో వీరు పట్టుబడగా, ప్రస్తుతం వారిని దేశం నుంచి బహిష్కరించే

# తెలంగాణలో జనసేన పోటీ ఖాయం: పవన్ కల్యాణ్



2లో

- తెలంగాణపై ప్రేమే కారణం
- విమర్శలకు ఘాటు సమాధానం
- ఎన్నికల్లో జనసేన బరిలోకి

హైదరాబాద్, జూన్ 2 (అనంత సూర్య ప్రతినిధి): తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామానికి తెరలేపుతూ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంచలన ప్రకటన చేశారు. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ తప్పకుండా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

# ఏలూరులో విషాద అగ్నిప్రమాదం



2లో

- మంటల్లో ఇద్దరు మృతి
- పూర్తిగా దగ్ధమైన ఇల్లు
- కారణాలపై దర్యాప్తు

ఏలూరు, జూన్ 2 (అనంత సూర్య ప్రతినిధి): ఏలూరు జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఘోర అగ్నిప్రమాదం ఇద్దరు వృద్ధ మహిళల ప్రాణాలను బలితీసుకుంది. వేలేరుపాడు గ్రామంలో ఒక ఇంట్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఇంట్లో నిద్రిస్తున్న ఇద్దరు మహిళలు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, వలగని సావిత్రి (60), పూలమ్మ (65) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మంటలు చెలరేగాయి. మంటలు క్షణాల్లోనే ఇంటి మొత్తం వ్యాపించడంతో ఇద్దరూ బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

# యోగాంధ్ర-2026కు విస్తృత ఏర్పాట్లు



2లో

**కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష**
**జూన్ 7 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు**
**ప్రజల భాగస్వామ్యానికి పిలుపు**

విజయవాడ, జూన్ 2 (అనంత సూర్య ప్రతినిధి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న యోగాంధ్ర-2026 కార్యక్రమాలపై ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్

# తెలంగాణకు చంద్రబాబు శుభాకాంక్షలు



2లో

- తెలుగు జాతి ఒక్కటే
- అభివృద్ధిలో పోటీ పడాలి
- ప్రపంచ స్థాయి నగరాల లక్ష్యం


అమరావతి, జూన్ 2 (అనంత సూర్య ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమ వేదిక ద్వారా స్పందించిన ఆయన, రెండు రాష్ట్రాలు భౌగోళికంగా విడిపోయినా తెలుగు జాతి ఎప్పటికీ ఒక్కటేనని పేర్కొన్నారు. తెలుగు ప్రజల మధ్య ఉన్న సాంస్కృతిక, భాషా, కుటుంబ బంధాలు ఎంతో గొప్పవని చంద్రబాబు అన్నారు. రాష్ట్రాల విభజన పరిపాలనా పరమైన అంశమే తప్ప ప్రజల మధ్య ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ విడదీయలేదని వ్యాఖ్యానించారు. ఉభయ రాష్ట్రాల ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అభివృద్ధి రంగంలో ఆరోగ్యకరమైన పోటీతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. పెట్టుబడులు, పరిశ్రమలు, విద్య, సాంకేతికత, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో రెండు రాష్ట్రాలు దేశానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. రాబోయే రోజుల్లో తెలుగు ప్రజలు మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దిశానిర్దేశం



3లో

# గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు



- 2027 పుష్కరాలపై సమీక్ష
- శాఖలతో సీఎం సమావేశం
- సమగ్ర కార్యాచరణకు ఆదేశాలు

3లో

అమరావతి, జూన్ 2 (అనంత సూర్య ప్రతినిధి): గోదావరి పుష్కరాలు--2027ను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుతో పాటు పుష్కరాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు.

# విజయ్‌కు హైకోర్టులో ఊరట



(మొదటి పేజీ తర్వాత)

దీంతో కోర్టు పిటిషన్ ఉపసంహరణకు అనుమతి మంజూరు చేసింది. పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం, 2015లో ఆదాయపన్ను శాఖ విజయ్ నివాసంలో సోదాలు నిర్వహించింది. ఆ సమయంలో ఆయన వద్ద సుమారు రూ.15 కోట్ల నగదు గుర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ మొత్తం ఒక సినిమా పారితోషికానికి సంబంధించినదిగా భావించినప్పటికీ, ఆదాయ వివరాల్లో దాన్ని పూర్తిగా వెల్లడించలేదని పిటిషనర్ ఆరోపించారు.

ఈ నేపథ్యంలో ఆదాయపన్ను శాఖ గతంలో విజయ్‌పై సుమారు రూ.1.5 కోట్ల జరిమానా విధించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ జరిమానాపై విజయ్ హైకోర్టును ఆశ్రయించగా, ఆ పిటిషన్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో కోర్టు తిరస్కరించింది. అనంతరం ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కొత్తగా మరో పిటిషన్ దాఖలైంది. విజయ్‌పై మనీల్యాండరింగ్, మోసం, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఆదాయ వివరాలు దాచిపెట్టిన అంశంపై దర్యాప్తు జరపాలని పిటిషనర్ కోర్టును కోరారు. అలాగే ఐటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయితే పిటిషన్‌ను కొనసాగించబోమని పిటిషనర్ కోర్టుకు తెలియజేయడంతో కేసు విచారణ అక్కడితో ముగిసింది. పిటిషన్ ఉపసంహరణతో ప్రస్తుతం ఈ వ్యవహారంపై ఎలాంటి తదుపరి న్యాయపరమైన ఆదేశాలు వెలువడలేదు. దీంతో తమిళనాడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన ఈ కేసు తాత్కాలికంగా ముగిసినట్లైంది.

# కేరళకు కొత్త డిప్యూటీ స్పీకర్



(మొదటి పేజీ తర్వాత)

అసెంబ్లీలో జరిగిన ఓటింగ్‌లో షానిమోల్ ఉస్మాన్‌కు 99 ఓట్లు లభించగా, ప్రత్యర్థి ముషిన్‌కు 34 ఓట్లు వచ్చాయి. డిప్యూటీ స్పీకర్ ఎన్నికలో బీజేపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు దూరంగా నిలిచారు. అసెంబ్లీ స్పీకర్ తిరువంచూర్ రాధాకృష్ణన్ సంప్రదాయం ప్రకారం ఓటింగ్‌లో పాల్గొనలేదు. దీంతో మొత్తం పోలైన ఓట్ల ఆధారంగా షానిమోల్ ఉస్మాన్ విజేతగా ప్రకటించారు. ఈ విజయంతో కేరళ అసెంబ్లీ చరిత్రలో డిప్యూటీ స్పీకర్ పదవిని చేపట్టిన నాలుగో మహిళగా షానిమోల్ ఉస్మాన్ ప్రత్యేక గుర్తింపు పొందారు. గతంలో కేఓ అయేషా బాయి, నఫీసాత్ బీవీ, భార్గవి థంకప్పన్ ఈ పదవిని నిర్వహించారు.

ఇప్పుడు ఆ జాబితాలో షానిమోల్ ఉస్మాన్ పేరు చేరింది.

ఇటీవల జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఎఫ్ కూటమి 102 స్థానాలను గెలుచుకుంది. స్పీకర్‌ను మినహాయిస్తే అధికార కూటమికి 101 ఓట్లు రావాల్సి ఉన్నప్పటికీ షానిమోల్ ఉస్మాన్‌కు 99 ఓట్లు మాత్రమే లభించాయి. అలాగే ఎల్‌డీఎఫ్‌కు చెందిన సభ్యుల సంఖ్యతో పోలిస్తే ఒక ఓటు తక్కువగా నమోదైంది. ఈ వ్యత్యాసానికి కారణాలపై అధికారికంగా ఎలాంటి సమాచారం వెల్లడికాలేదు. అలప్పుజా జిల్లాలోని ఆరూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న షానిమోల్ ఉస్మాన్ కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకురాలిగా గుర్తింపు పొందారు. ఆమె ఎన్నికను యూడీఎఫ్ శ్రేణులు స్వాగతించగా, మహిళా నాయకత్వానికి ఇది మరో మైలురాయిగా రాజకీయ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. కేరళ అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న షానిమోల్ ఉస్మాన్ సభా నిర్వహణలో కీలక పాత్ర పోషించనున్నారు. ఆమె ఎన్నికతో రాష్ట్ర రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం మరింత బలోపేతమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# తెలంగాణలో జనసేన పోటీ ఖాయం: పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తర్వాత)

హైదరాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న విమర్శలు, బెదిరింపులు, తెలంగాణపై చేస్తున్న దుష్ప్రచారానికి ఘాటుగా బదులిచ్చారు. తెలంగాణ తనకు ఎంతో ఆత్మీయమైన నేల అని, ఈ ప్రాంతంపై తనకు ఎనలేని ప్రేమ ఉందని పేర్కొన్నారు. కొందరు రాజకీయ నాయకులు, విశ్లేషకులు ఉద్దేశపూర్వకంగా తనపై ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎన్నడూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించలేదని పవన్ కల్యాణ్ మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన జరిగిన తీరును మాత్రమే ప్రశ్నించానని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పార్లమెంట్‌లో వ్యవహరించిన విధానాన్ని తప్పుపట్టానని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఎప్పుడూ గౌరవించానని, సామాజిక న్యాయంతో కూడిన తెలంగాణ తన కల అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన యువత, అమరవీరుల త్యాగాలకు తనకు అపార గౌరవం ఉందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా కొందరు తనను తెలంగాణ వ్యతిరేకిగా చిత్రీకరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలపైనా పవన్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో తాను చెరువు భూమిని ఆక్రమించానంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆ భూమిని పరిశీలించాలని సవాల్ విసిరారు. తాను భూమి ఆక్రమించినట్లు నిరూపితమైతే ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవచ్చని, తనపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని ప్రకటించారు. అధికార పదవుల కోసం రాజకీయాలు చేయడం తన లక్ష్యం కాదని, వ్యవస్థలో మార్పు తీసుకురావడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి అవ్వాలనే ఆశ తనకు లేదని, ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయాల ఉద్దేశమని తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని కార్యకర్తలు, నాయకులు ఎప్పటి నుంచో కోరుతున్నారని పవన్ తెలిపారు. ఎవరి బెదిరింపులకు భయపడబోదని హెచ్చరించారు. తెలంగాణలో ప్రజా సమస్యలపై మాట్లాడతామని, అన్యాయాలను ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమని, ఎవరూ తమ ఇష్టానుసారం ఎవరికైనా ప్రవేశం నిరాకరించలేరని పేర్కొన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని కూడా పవన్ భావోద్వేగంగా గుర్తు చేసుకున్నారు. గద్దర్ జీవించి ఉన్న సమయంలో ఆయనకు అవసరమైన సహాయం చేశానని, ఆయన తనను ఎంతో ఆప్యాయంగా చూసేవారని చెప్పారు. గద్దర్ బతికున్నప్పుడు పట్టించుకోని వారు ఇప్పుడు ఆయన పేరును రాజకీయాల కోసం ఉపయోగించుకోవడం విచారకరమన్నారు. తనకు వామపక్షాలు, కుడిపక్షాలు అనే భావజాలాల కంటే మానవతా విలువలే ముఖ్యమని తెలిపారు. గద్దర్ చివరి రోజుల్లో కూడా యువత భవిష్యత్తుపై ఆలోచించారని, ఆ సందేశాన్ని సమాజానికి చేరవేయడం మన బాధ్యత అని అన్నారు. ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య కొందరు కావాలనే విద్వేషాలు రెచ్చగొడుతున్నారని పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. నాయకుల తప్పులను ప్రజలపై మోపడం సరికాదని, ప్రాంతీయ ద్వేషాలు దేశ సమగ్రతకు హానికరమని హెచ్చరించారు. తెలంగాణలో పరిశ్రమలు రాకపోయినా, ఉపాధి సమస్యలు ఉన్నా వాటికి ఆంధ్ర ప్రజలను బాధ్యులను చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రజలు వేరు, పాలకులు వేరు అనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల ప్రజలు పరస్పర గౌరవంతో జీవించాలని, భారతీయులుగా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణపై తన ప్రేమను ఎవరూ ప్రశ్నించలేరని, రాష్ట్ర ప్రజలతో కలిసి పనిచేయడం కొనసాగిస్తానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు..

# ఏలూరులో విషాద అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తర్వాత)

మృతుల్లో ఒకరైన పూలమ్మ తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లాకు చెందినవారు. ఆమె తన సోదరి సావిత్రి ఇంటికి బంధువులను పరామర్శించేందుకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే అనుకోని అగ్నిప్రమాదం ఇద్దరి ప్రాణాలను బలిగొనడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మంటల తీవ్రతకు ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. ఇంట్లోని గృహోపకరణాలు, సామగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే పక్కనే ఉన్న మరో ఇంటికి కూడా మంటలు వ్యాపించి కొంత మేర నష్టం వాటిల్లినట్లు సమాచారం. స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా వ్యాపించిన మంటలను అదుపులోకి తీసుకువచ్చి మరింత నష్టం జరగకుండా అడ్డుకున్నారు. అనంతరం మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేదా ఇతర సాంకేతిక కారణాలతో మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే ప్రమాదానికి గల అసలు కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అమెరికాలో 30 మంది భారతీయుల అరెస్ట్

(మొదటి పేజీ తర్వాత)

బహిష్కరించే ప్రక్రియ ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. అరిజోనా రాష్ట్రంలోని యూమా సెక్టార్ పరిధిలో మే 11 నుంచి 15 వరకు "ఆపరేషన్ చెక్‌మేట్" పేరుతో ఈ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తూ కమర్షియల్ వాహనాలు నడుపుతున్న వ్యక్తులను గుర్తించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. ఆపరేషన్ సందర్భంగా మొత్తం 52 మందిని అదుపులోకి తీసుకోగా, వారిలో 36 మంది సెమీ ట్రక్కుల డ్రైవర్లుగా పనిచేస్తున్నట్లు గుర్తించారు.

అరెస్టయిన 36 మంది ట్రక్కు డ్రైవర్లలో 30 మంది భారతీయులే కావడం విశేషం. మిగిలిన వారిలో మెక్సికో, ఎల్ సాల్వడార్, రష్యా దేశాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. తనిఖీల సమయంలో వీరిలో చాలామంది వద్ద ఉన్న ఉపాధి పత్రాలు వారి చట్టబద్ధ హోదాకు అనుగుణంగా లేవని విచారణలో తేలినట్లు వెల్లడించారు. యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విడుదల చేసిన ప్రకటనలో ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయడమే ఈ చర్యల లక్ష్యమని పేర్కొంది. అమెరికా సరఫరా వ్యవస్థలో కీలక పాత్ర పోషించే ట్రక్కింగ్ రంగంలో నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది. వాణిజ్య వాహనాలు నడిపే వ్యక్తులు చట్టబద్ధ అనుమతులు కలిగి ఉండేలా ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపింది.

ఇటీవలి కాలంలో అమెరికా ప్రభుత్వం అక్రమ వలసదారులపై మరింత కఠిన వైఖరి అవలంబిస్తోంది. ముఖ్యంగా వీసా గడువు ముగిసినా దేశంలోనే కొనసాగుతున్న వారు, తప్పుడు పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై విస్తృత తనిఖీలు నిర్వహిస్తోంది. గత కొన్ని నెలలుగా జరిగిన పలు ఆపరేషన్లలో కూడా భారతీయులు సహా అనేక దేశాల పౌరులు పట్టుబడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం అరెస్టయిన 30 మంది భారతీయుల వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. వారి పేర్లు, స్వస్థలాలు, అమెరికాలోకి ప్రవేశించిన విధానం వంటి అంశాలను వెల్లడించలేదు. అయితే ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ చట్టాల ప్రకారం వారిపై దేశ బహిష్కరణ చర్యలు కొనసాగుతున్నట్లు సమాచారం. అమెరికా హైవేల భద్రత, వాణిజ్య రవాణా వ్యవస్థలో చట్టబద్ధతను నిర్ధారించడంలో భాగంగానే ఇటువంటి తనిఖీలు మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు సూచించారు.

# యోగాంధ్ర–2026కు విస్తృత ఏర్పాట్లు

(మొదటి పేజీ తర్వాత)

జిల్లాలో యోగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 7వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర–2026 కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో యోగా కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల ద్వారా యోగా ప్రాముఖ్యతను ప్రతి ఇంటికీ చేరవేయాలని కలెక్టర్ అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు, వివిధ వర్గాల ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని యోగాంధ్ర–2026 కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. యోగా సాధనను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, క్రీడా శాఖ ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు పాల్గొని కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. యోగాంధ్ర–2026ను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# తెలంగాణకు చంద్రబాబు శుభాకాంక్షలు



(మొదటి పేజీ తర్వాత)

తెలంగాణ రాజధాని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రపంచ స్థాయి నగరాలుగా ఎదగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, సాంకేతిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో ఈ రెండు నగరాలు అంతర్జాతీయ గుర్తింపు పొందాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారి ప్రతిష్ఠను మరింత పెంచే కేంద్రాలుగా అవి రూపుదిద్దుకోవాలని అన్నారు.

ప్రతి తెలుగు కుటుంబం అభివృద్ధి ఫలాలను అందుకోవాలని, ఉన్నత జీవన ప్రమాణాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల పరంగా ప్రతి కుటుంబం ముందుకు సాగేందుకు ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 'వికసిత భారత్ -- 2047' లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కీలక పాత్ర పోషించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు ముందుండాలని, ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతి ఖ్యాతిని మరింతగా చాటాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మరోసారి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభివృద్ధి, శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు.

అనంత సూర్య తెలుగువార్త



## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి




అనంతపురం, జూన్ 2 అనంత సూర్య న్యూస్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ, అనంతపురం నగరంలోని క్లాక్ టవర్ సెంటర్ లో రైతుకూలీ సంఘం, ఏ ఐ ఎఫ్ టి యు (న్యూ) ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల భారాన్ని తగ్గించాలని, మోదీ సర్కార్ అమెరికన్ సామ్రాజ్యవాదులకు లొంగిపోవడాన్ని నిరసిస్తూ నిరసనకారులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. చంద్రశేఖర్, గజ్జెల దస్తగిరి, ఏ ఐ ఎఫ్ టి యు నాయకులు హాజీవలి, రామాంజనేయులు, కృష్ణ, మహిళా నాయకులు వెంకటలక్ష్మి, రాధమ్మ తదితరులు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదులకు లొంగిపోయిందని విమర్శించారు. అంతర్జాతీయంగా చౌకగా లభించే రష్యా, ఇరాన్ దేశాల ఆయిల్ ను కాదని, అమెరికా కంపెనీల నుంచి అధిక ధరలకు ముడి చమురును కొనుగోలు చేస్తూ.. ఆ భారాన్ని దేశ ప్రజలపై మోపుతున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధనంపై లీటరుకు 60 నుండి 70 శాతం వరకు పన్నులు వేసి సామాన్యుడి నడుం విరుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ పన్నులను తగ్గించాలని, వ్యవసాయానికి ఉపయోగించే డీజిల్ ను లీటర్ రూ. 35 లకే అందించాలని సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేస్తోందని వారు గుర్తుచేశారు. వాణిజ్య సిలిండర్ల ధరలు విపరీతంగా పెంచడం వల్ల మార్కెట్లో టీ, టిఫిన్, భోజనం ధరలు సామాన్యుడికి అందకుండా పోయాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే డీజిల్ ధరల పెరుగుదల రవాణా రంగాన్ని దెబ్బతీసిందని, దీనివల్ల నిత్యావసర వస్తువుల ధరలన్నీ ఆకాశాన్ని అంటాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధరలను అదుపు చేయకపోతే.. రైతుకూలీలు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున సమైక్య పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

# ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండండి



అనంతపురం, జూన్ 2 అనంత సూర్య న్యూస్ : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ)కు సాంకేతిక అవగాహన ఉండాలన్నారు. మంగళవారం నగరంలోని హెచ్ఎల్సీ కాలనీలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయంలో అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బీఎల్ఏలు, పార్టీ నేతలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే పరిస్థితులను పార్టీ నియమించిన ఎస్ఐఆర్ కో ఆర్డినేటర్ గోపీనాథ్ వివరించారు. ఓటరు ధృవీకరణ విధానం, కుటుంబ లింకేజీల పరిశీలన, డ్రాఫ్ట్ ఓటరు జాబితా పరిశీలన, క్లెయిమ్స్--అభ్యంతరాల దాఖలు ప్రక్రియ తదితర అంశాలపై సుదీర్ఘంగా తెలియజేశారు. జూన్ 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ విధానాన్ని వివరించారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చూడటంతో పాటు, ఎలాంటి పొరపాట్లు, అక్రమాలు చోటుచేసుకోకుండా బీఎల్ఏలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. ఓటు హక్కు పరిరక్షణలో బీఎల్ఏలు కీలకం : అనంత

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ఓటు హక్కు పరిరక్షణలో బీఎల్ఏ (బూత్ లెవల్ ఏజెంట్లు)ల పాత్ర అత్యంత కీలకమని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఉపయోగించే వివిధ రకాల అప్లికేషన్ ఫారాలపై ఏజెంట్లకు పూర్తి పట్టు ఉండాలన్నారు. పార్టీ బూత్ స్థాయిలో బలంగా ఉండటం ఎన్నికల విజయానికి ఎంతో కీలకంగా మారుతుందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగినంత కాలం ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేస్తూ ఓటర్లతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలన్నారు. డివిజన్లు, పంచాయతీ పరిధిలోని నాయకులతో బీఎల్ఏలు సమన్వయం చేసుకుని అందరూ కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం తరపున నియమితులయ్యే బీఎల్ఓలతో నిత్యం సమన్వయం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, ఇలాంటి సమయంలో వైసీపీ మద్దతుదారులు, సానుభూతిపరుల ఓట్లు తొలగించే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు. బూత్ స్థాయిలో జరిగే ప్రతి పరిణామాన్ని నిశితంగా పరిశీలించాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి చోటివద్దని సూచించారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఓటర్ల తొలగింపు వివాదాస్పదమైన విషయాన్ని గుర్తు చేశారు. ఎస్ఐఆర్ జరిగే సమయంలో అధికారులపై కూడా ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని, ఎక్కడైనా సమస్యలు వస్తే తక్షణం తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా పని చేయాలని తెలిపారు. అర్హత లేని వ్యక్తులు లేదా ఆ ప్రాంతంలో నివసించని వారి పేర్లు ఓటర్ల జాబితాలోకి రాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వైసీపీ అనంతపురం నియోజకవర్గ పరిశీలకులు తిప్పేస్వామి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఐడీ కార్డుల వెరిఫికేషన్ వంద శాతం పూర్తయిందని, ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా జరిగేలా చూడాలని సూచించారు.

# గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు




(మొదటి పేజీ తర్వాత)

సమావేశంలో పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, రవాణా సదుపాయాలు, పర్యాటక అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

గోదావరి పుష్కరాలు రాష్ట్ర ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని పేర్కొన్న ముఖ్యమంత్రి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఘాట్ల వద్ద మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పుష్కరాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టు ద్వారా గోదావరి పరివాహక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు సమావేశంలో చర్చించారు. పుష్కరాల సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటేలా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచనలు ఇచ్చారు.

ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, పి. నారాయణ, అనిత, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, దేవాదాయ, వైద్యారోగ్య, రవాణా, పర్యాటక, పురపాలక, పంచాయతీరాజ్, ఆర్థిక, జలవనరులు, పోలీసు శాఖల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరై పుష్కరాల నిర్వహణకు సంబంధించిన ప్రణాళికలను ముఖ్యమంత్రికి వివరించారు. 2027 గోదావరి పుష్కరాలను దేశంలోనే ఆదర్శవంతంగా నిర్వహించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

# జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దిశానిర్దేశం



మొదటి పేజీ తర్వాత

పుట్టపర్తి, జూన్ 2: శ్రీ సత్యసాయి జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మంగళవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా పురోగతికి సంబంధించిన 15 కీలక ఎజెండా అంశాలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యలకు సంబంధించిన ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రానున్న యోగాంధ్ర-2026 కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షిస్తూ, జూన్ 7న యోగా ప్రారంభోత్సవాన్ని చారిత్రక ప్రాధాన్యం కలిగిన లేపాక్షిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని సూచించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జనగణన విధులను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా వచ్చిన అర్జీలను గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో పరిశుభ్రత కోసం ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని, జలధార-జలహారతి కార్యక్రమాలు మరియు ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ గృహ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, లబ్ధిదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజనపై ప్రజల్లో అవగాహన పెంచాలని, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా జిల్లాలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వత నైపుణ్యాభివృద్ధికి కౌశల్యం కార్యక్రమం, సామాజిక సేవల అందుబాటు, ఐ-గాట్ కర్మయోగి డిజిటల్ ప్లాట్‌ఫారమ్ వినియోగంపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేసి ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల అవగాహన పెంపొందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో చక్రపాణి, డివిజన్ అటవీ అధికారి శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీడబ్ల్యూఎంఏ పీడీ విజయ్ ప్రసాద్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో

## కీలక అభివృద్ధి పనులపై సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి

- ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కలిసిన పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్
- పేరూరు ప్రాజెక్టు భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి
- హంద్రీనీవా -పీఏబీఆర్ కాలువల అనుసంధానంపై మరోసారి సీఎం దృష్టికి
- ఇంకా కొన్ని సమస్యలు, అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రికి వినతి పత్రం
- సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు





అనంతపురం, జూన్ 2 అనంత సూర్య న్యూస్ : రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలలోని కీలక అభివృద్ధి పనులు, సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. ఉదయం ఎస్ఐఆర్ పై సీఎం చంద్రబాబు నిర్వహించిన సమావేశంలో వీరు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రితో సచివాలయంలో వారు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇందులో ప్రధానంగా జీడిపల్లి - పేరూరు రిజర్వాయర్ కాలువ కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం గురించి ప్రస్తావించారు. పరిటాల రవీంద్ర సాగునీటి పథకానికి 2018 లోనే భూసేకరణ చేశారని అయితే అప్పట్లో ప్రభుత్వం మారడం వల్ల వైసిపి వారు ఈ ప్రాజెక్టును పూర్తిగా పక్కన పడేశారన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రైతులు ప్రభుత్వంపై నమ్మకంతో దాదాపు వెయ్యి ఎకరాల వరకు భూములు ఇచ్చారన్నారు. 2018-19లో కేవలం 95 ఎకరాలకు మాత్రమే రూ.5.20 కోట్ల పరిహారం చెల్లించగా, మిగిలిన 915 ఎకరాలకు సంబంధించిన సుమారు రూ.50.75 కోట్ల పరిహారం ఇప్పటికీ చెల్లించలేదన్నారు. భూములు కోల్పోయిన రైతులు గత ఎనిమిదేళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నారని.. భూములు కోల్పోవడంతో పాటు పంటల ఆదాయాన్ని కూడా కోల్పోయారన్నారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు 2025 మార్చి 30న సుమారు రూ.45 కోట్ల నష్టపరిహారం చెల్లించినప్పటికీ, అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుకు చెల్లించాల్సిన రూ.55 కోట్లలో కేవలం రూ.2 కోట్లు మాత్రమే విడుదల చేశారని..ఇంకా దాదాపు రూ.53 కోట్ల నష్టపరిహారం రైతులకు అందాల్సి ఉండటంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల రైతాంగానికి సాగు, తాగునీటి భద్రత కల్పించేందుకు హంద్రీనీవా మెయిన్ కెనాల్‌ను పీఏబీఆర్ కుడి కాలువతో అనుసంధానం చేయాలని కోరారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు, నీటి కొరత కారణంగా పీఏబీఆర్ కెనాల్ పరిధిలోని చెరువులు పూర్తిస్థాయిలో నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ఈ కాలువ ద్వారా రెండు జిల్లాల్లో 49 మైనర్ ఇరిగేషన్ చెరువులకు నీరు అందించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం పీఏబీఆర్ ద్వారా వస్తున్న నీరు సరిపోవటం లేదని అందుకే హంద్రీనీవా కాలువ ద్వారా అనుసంధానం చేస్తే ఈ చెరువులకు పూర్తిస్థాయిలో నీరు అందించవచ్చున్నారు. 150 క్యూసెక్కుల నీటిని 70 రోజులపాటు విడుదల చేసే విధంగా 0.90 టీఎంసీ నీటి కేటాయింపు అవసరం ఉందని ఈ లింక్ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.4.50 కోట్ల వ్యయం అవసరమవుతుందన్నారు. మరోవైపు రాప్తాడు వ్యవసాయ మార్కెట్ కమిటీకి భూమి కేటాయింపుపై ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు. ధర్మవరం నియోజకవర్గంలో రహదారి, వంతెన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్మవరం -- ఎన్.హెచ్ 42 రహదారిపై దెబ్బతిన్న కాజ్‌వేకు అత్యవసర మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కాజ్‌వే మరమ్మతుల కోసం రూ.90 లక్షలు మంజూరు చేయాలన్నారు. ధర్మవరం--ధర్మపురి రహదారిలో గంగమ్మగుడి సమీపంలో చిత్రావతి నదిపై ఉన్న లో-లెవల్ కాజ్‌వే స్థానంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.30 కోట్లు అవసరం ఉంటుందని వివరించారు. ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ చేసిన విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఇందులో కొన్నింటికి ఇప్పటికే ఆదేశించామని... మిగిలిన వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

# వాణిజ్య గ్యాస్ ధరల మోత.. సామాన్యులకు మాత్రం ఊరట



న్యూఢిల్లీ, జూన్ 2 (అనంత సూర్య ప్రతినిధి): దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాల కోసం వినియోగించే ద్రవీభవన పెట్రోలియం వాయువు సిలిండర్ల ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు మరోసారి పెంచాయి. అయితే గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడంతో సాధారణ వినియోగదారులకు కొంత ఉపశమనం లభించింది. కొత్త ధరలు జూన్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి.

తాజా సవరణల ప్రకారం రాజధాని ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరపై రూ.42 పెంపు జరిగింది. దీంతో ఒక్కో సిలిండర్ ధర రూ.3,113.50కు చేరుకుంది. కోల్‌కతాలో రూ.53.50 పెరగడంతో అక్కడి ధర రూ.3,255.50కు చేరింది. ముంబై, చెన్నై, హైదరాబాద్‌తో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ధరలను పెంచారు. అలాగే ఐదు కిలోల స్వేచ్ఛా వాణిజ్య సిలిండర్ ధరను రూ.11 పెంచడంతో ఢిల్లీలో అది రూ.821.50కు చేరింది.

అయితే గృహ వినియోగదారులకు ఉపయోగపడే సబ్సిడీ, సాధారణ వంటగ్యాస్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో కుటుంబాల నెలవారీ ఖర్చులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం, చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు అంతర్జాతీయ విమానయాన రంగానికి ఊరటనిస్తూ విమాన టర్బైన్ ఇంధనం ధరలను సుమారు 2.7 శాతం మేర తగ్గించారు. ఈ తగ్గింపు ప్రధానంగా విదేశీ విమాన సర్వీసులకు వర్తించనుంది. అయితే దేశీయ విమానయాన సంస్థలకు వర్తించే ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు.

పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఇంధన నిల్వలను బలోపేతం చేసేందుకు ఈ ధరల సవరణలు చేపట్టినట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, సరఫరా భద్రత వంటి అంశాలు కూడా ఈ నిర్ణయాలపై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరల పెంపు ప్రభావం ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, క్యాటరింగ్ సంస్థలు మరియు చిన్న ఆహార వ్యాపారాలపై పడే అవకాశం ఉంది. వారి నిర్వహణ వ్యయాలు పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో ఆహార పదార్థాల ధరలపై కూడా ప్రభావం కనిపించే అవకాశముందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే గృహ వినియోగ సిలిండర్ల ధరలు యథాతథంగా ఉండటం వల్ల సామాన్య కుటుంబాలకు మాత్రం తక్షణ భారం తప్పిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


## వాణిజ్య గ్యాస్ ధరల మోత.. సామాన్యులకు మాత్రం ఊరట

న్యూఢిల్లీ, జూన్ 2 (అనంత సూర్య ప్రతినిధి): దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాల కోసం వినియోగించే ద్రవీభవన పెట్రోలియం వాయువు సిలిండర్ల ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు మరోసారి పెంచాయి. అయితే గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడంతో సాధారణ వినియోగదారులకు కొంత ఉపశమనం లభించింది. కొత్త ధరలు జూన్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి.తాజా సవరణల ప్రకారం రాజధాని ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరపై రూ.42 పెంపు జరిగింది. దీంతో ఒక్కో సిలిండర్ ధర రూ.3,113.50కు చేరుకుంది. కోల్‌కతాలో రూ.53.50 పెరగడంతో అక్కడి ధర రూ.3,255.50కు చేరింది. ముంబై, చెన్నై, హైదరాబాద్‌తో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ధరలను పెంచారు. అలాగే ఐదు కిలోల స్వేచ్ఛా వాణిజ్య సిలిండర్ ధరను రూ.11 పెంచడంతో ఢిల్లీలో అది రూ.821.50కు చేరింది.

అయితే గృహ వినియోగదారులకు ఉపయోగపడే సబ్సిడీ, సాధారణ వంటగ్యాస్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో కుటుంబాల నెలవారీ ఖర్చులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం, చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అంతర్జాతీయ విమానయాన రంగానికి ఊరటనిస్తూ విమాన టర్బైన్ ఇంధనం ధరలను సుమారు 2.7 శాతం మేర తగ్గించారు. ఈ తగ్గింపు ప్రధానంగా విదేశీ విమాన సర్వీసులకు వర్తించనుంది. అయితే దేశీయ విమానయాన సంస్థలకు వర్తించే ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు.పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఇంధన నిల్వలను బలోపేతం చేసేందుకు ఈ ధరల సవరణలు చేపట్టినట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, సరఫరా భద్రత వంటి అంశాలు కూడా ఈ నిర్ణయాలపై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరల పెంపు ప్రభావం ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, క్యాటరింగ్ సంస్థలు మరియు చిన్న ఆహార వ్యాపారాలపై పడే అవకాశం ఉంది. వారి నిర్వహణ వ్యయాలు పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో ఆహార పదార్థాల ధరలపై కూడా ప్రభావం కనిపించే అవకాశముందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.


# జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాల్లో 'తేజ' ప్రభంజనం

- ఆల్ ఇండియా 217వ ర్యాంకుతో జిల్లా ఫస్ట్ సాధించిన వి.అఖిల రెడ్డి
- మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు
- అనంతపురం జిల్లా కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన తేజ విద్యాసంస్థలు




అనంతపురం, జూన్ 2 అనంత సూర్య న్యూస్ : దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాల్లో అనంతపురం నగరానికి చెందిన 'తేజ జూనియర్ కళాశాల' సరికొత్త రికార్డులను సృష్టించింది. కళాశాల విద్యార్థిని వి.అఖిల రెడ్డి ఆల్ ఇండియా స్థాయిలో 217వ ర్యాంకు సాధించి, అనంతపురం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచి సంచలనం సృష్టించింది. ఈ ఘన విజయం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మరియు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతను మరింత పెంచిన విజయాలు: డైరెక్టర్ తేజేశ్వర రెడ్డి

ఈ సందర్భంగా తేజ విద్యాసంస్థల డైరెక్టర్ తేజేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుంచే వరుసగా ప్రతి ఏటా జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తున్నామని, మొన్న ఇంటర్ ఫలితాల్లో స్టేట్ టాప్ ర్యాంకులు, నిన్న జేఈఈ మెయిన్స్, నేడు అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయి ర్యాంకులు రావడం మా విద్యాసంస్థల బాధ్యతను మరింత పెంచిందన్నారు. అనంతపురం జిల్లా కీర్తి ప్రతిష్టలను జాతీయ స్థాయిలో నిలబెట్టిన మా విద్యార్థులకు, మాపై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలని తెలిపారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కూడా తమ విద్యార్థులు అద్భుతమైన ర్యాంకులు సాధించారని ఆయన గుర్తుచేశారు.

మూడేళ్లలోనే చరిత్ర తిరగరాశాం..

కళాశాల చైర్‌పర్సన్ ఉమా దేవి మాట్లాడుతూ.. కళాశాల స్థాపించిన కేవలం మూడు సంవత్సరాల కాలంలోనే తమ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇంతటి ప్రతిభ చూపడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థుల కఠోర శ్రమ, నిష్ణాతులైన అధ్యాపకుల బోధన వల్లే ఇది సాధ్యమైందని, భవిష్యత్తులో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అకడమిక్ డైరెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. దశాబ్దాల చరిత్ర, వందలాది బ్రాంచ్‌లు ఉండి, లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేసే పెద్ద సంస్థలు కూడా సాధించలేని అద్భుత ఫలితాలను, తేజ జూనియర్ కళాశాల సాధారణ విద్యార్థులతో, ఒకే చోటు నుండి సాధించి చరిత్రను తిరగరాసిందని కొనియాడారు. మరో అకడమిక్ డైరెక్టర్ ఆదర్శ్ మాట్లాడుతూ.. గత ఏడాది (2025) జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా 81వ ర్యాంక్, మెయిన్స్‌లో 151వ ర్యాంక్, నీట్‌లో 1872వ ర్యాంకులతో ఇప్పటికే పోటీ ప్రపంచంలో అగ్రగామిగా నిలిచామని, ఆ పరంపరను ఈ ఏడాది కూడా కొనసాగించామని తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ర్యాంకుల వివరాలు:

భార్గవి (232), అఖిల (976), అన్వేష్ (4005), జశ్వంత్ నాయక్ (4024), వికాస్ (17998), భరణి (19312), ఇందు వర్ధన్ రెడ్డి (29951), తేజ (34992), నారాయణ రెడ్డి (39664), అరుణ్ కుమార్ (43372), లాలూ ప్రసాద్ నాయక్ (44176). వీరంతా మెరుగైన ర్యాంకులతో అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించి నేడు ఘన విజయం సాధించారని పేర్కొన్నారు.

మిన్నంటిన సంబరాలు - విద్యార్థులకు అభినందనలు

అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను తేజ విద్యాసంస్థల డైరెక్టర్ తేజేశ్వర్ రెడ్డి, చైర్‌పర్సన్ ఉమాదేవి, సీఈఓ అనిల్ కుమార్, అకడమిక్ డైరెక్టర్లు సాయి చైతన్య, నేత్ర వాణి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు రాజశేఖర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ పెద్ది రెడ్డి, వహీద్ ఖాన్, ఫాతిమా మేడమ్ మరియు అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు. తమ పిల్లల విజయాల పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, యాజమాన్య కృషిని కొనియాడారు.

# మళ్లీ టాప్-10లో సింధు



జకార్తా, జూన్ 2 : భారత స్టార్ షట్లర్ పీవీ సింధు బ్యాడ్మింటన్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మరోసారి టాప్ పది స్థానాల్లోకి ప్రవేశించింది. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత పదో ర్యాంక్‌ను అందుకున్న తెలుగు తేజం తన ఆటతో అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇటీవలి కాలంలో ఒక్క టైటిల్ కూడా సాధించకపోయినా, ఇండోనేషియా ఓపెన్‌లో నమోదు చేసిన అద్భుత విజయంతో సింధు తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుంది. థాయ్‌లాండ్‌కు చెందిన బుసానన్ ఒంగ్‌బమ్రుంగ్‌ఫాన్‌పై విజయం సాధించి తదుపరి రౌండ్‌కు చేరుకోవడంతో పాటు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం ఎగబాకింది.

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో సింధు 11వ స్థానంలో నిలిచింది. అయితే ఇండోనేషియా ఓపెన్ తొలి రౌండ్‌లో విజయం సాధించడంతో ఆమె పదో స్థానాన్ని కైవసం చేసుకుంది. రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన సింధు గత కొంతకాలంగా క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్ దశలకే పరిమితమవుతూ వచ్చింది. కానీ ఈసారి ఇండోనేషియా ఓపెన్‌లో తన అనుభవాన్ని చాటుతూ టాప్-10లోకి తిరిగి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో థాయ్‌లాండ్ క్రీడాకారిణి గట్టి పోటీ ఇచ్చినప్పటికీ సింధు తొలి గేమ్‌ను 25-23తో గెలుచుకుంది. అనంతరం రెండో గేమ్‌లో మరింత దూకుడుగా ఆడి 21-16తో విజయాన్ని ఖాయం చేసుకుంది.

ఇప్పుడు తదుపరి రౌండ్‌లో ప్రపంచ నంబర్ వన్ దక్షిణ కొరియా స్టార్ అన్ సే యంగ్‌తో సింధు తలపడనుంది. ఈ పోరు బ్యాడ్మింటన్ అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. అగ్రశ్రేణి క్రీడాకారిణిపై విజయం సాధిస్తే సింధు మరింత ముందుకు దూసుకెళ్లే అవకాశం ఉంది. ఇండోనేషియా ఓపెన్‌లో సింధు ప్రదర్శన భారత బ్యాడ్మింటన్‌కు శుభసూచకంగా మారగా, రాబోయే అంతర్జాతీయ టోర్నీలకు ముందు ఆమె ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405